క్లుప్తంగా

ఓంశక్తి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారి ఊరేగింపులో గంజి కుండలతో నడుస్తున్న భక్తులు

సత్యవేడు: కాళమనాయుడుపేట పంచాయతీలోని గాంధీపురంలో నూతన ఓం శక్తి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. గంజి కుండల మొక్కు చెల్లించే భక్తులు ఊరేగింపు వెంట నడిచారు. ఎరుపు దుస్తులు ధరించిన భక్తులు అమ్మవారి ఆలయంలో పూజలకు హాజరయ్యారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం చేశారు.

శ్రీకృష్ణుడి చిత్రపటం ఊరేగింపు



బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని శుక్రవారం యోగాగురువు సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని ఊరేగించారు. వీధులలోని మహిళలు, భక్తులు టెంకాయలు కొట్టారు. శ్రీకృష్ణుడి గొప్పదనాన్ని ఆయన గ్రామస్తులకు వివరించారు. మహావిష్ణువు ఎనిమిదవ అవతారం శ్రీకృష్ణుడు అని, కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడికి మార్గదర్శకత్వం, భగవద్గీత ఉపదేశాలు గొప్పవన్నారు.

ఉయ్యాలసేవలో పవళింపు



ఉయ్యాల సేవలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం ఉయ్యాల సేవలో పవళిస్తూ దర్శనమిచ్చారు. పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సుప్రభాత సేవతో తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను చేశారు. ఉదయం 7 గంటలకు వేంకటేశ్వరస్వామికి, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై పద్మావతీ అమ్మవారిని సుందరంగా అలంకరించి అధిష్టింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు అనంతరం ఉయ్యాల సేవలో సేదదీరారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకులు శ్రీనివాసభట్టాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేణిగుంట: జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న జూలియన్ రాజు, ఏర్పేడు : 1200 అడుగుల జెండాతో ర్యాలీ చేస్తున్న పల్లం హైస్కూల్ విద్యార్థులు, ఎంపీడీవో కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న అధికారులు









ఆకాశవీధిలో మువ్వన్నెల రెపరెపలు

ఏర్పేడు: భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పంచాయతీ కార్యాలయాల్లో మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ భార్గవి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఇన్‌చార్జి ఎంపీపీ జముళ్ల శ్రీనివాసులు, ఎంపీడీవో సౌభాగ్యమ్మ జెండా ఎగురవేశారు. ఏర్పేడు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నల్లపాళెం శివయ్య, ఎండీ పుత్తూరులో సర్పంచ్ కందాటి మోహనప్రియ జెండా వందనం చేశారు. వ్యాసాశ్రమంలోని ఎస్వీ హైస్కూల్లో ఆశ్రమ మేనేజర్ మన్నెం అమరనాథరెడ్డి జెండా ఎగురవేశారు. పల్లం హైస్కూల్ హెచ్‌ఎం తీగల ఆనంద్ సారథ్యంలో యువతేజం ట్రస్ట్, కలాం విజన్ ఆధ్వర్యంలో 1200 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు ర్యాలీ చేశారు. పాఠశాల ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రఖ్యాత జాతీయ విద్యాసంస్థలైన తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో డైరెక్టర్ డాక్టర్ కెఎన్ సత్యనారాయణ, ఐసర్‌లో డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య జెండా వందనం చేశారు. అంజిమేడు ఎంపీపీ పాఠశాల పిల్లలకు శుక్రవారం స్పిక్ అండ్ గ్రీన్‌స్టోన్ సంస్థ రీజనల్ మేనేజర్ సి.గంగాధర్ పిల్లలకు స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, విద్యాసామగ్రిని పంపిణీ చేశారు.

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తొట్టంబేడు: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు భారతి జెండా వందన సమర్పణ చేశారు.

రేణిగుంట: మండలంలోని డీఎస్పీ కార్యాలయం వద్ద డీఎస్పీ శ్రీనివాసరావు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ హరి ప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ రెడ్డి, రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్ శేషగిరిరావు, రైల్వే క్యారేజీ రిపేర్ షాప్ ఆవరణలో చీఫ్ వర్క్ షాప్ మేనేజర్ దేవ సహాయం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వివిధ రకాల క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.







నాగలాపురం: మండల పరిషత్ కార్యాలయంలో.. బుచ్చినాయుడుకండ్రిగ: కల్లివెట్టులో విద్యార్థినుల పిరమిడ్ విన్యాసం, ఏర్పేడు : వ్యాసాశ్రమంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఆశ్రమ మేనేజర్ మన్నెం అమరనాథరెడ్డి

రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం ఆవరణలో డైరెక్టర్ భూమి నాథన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కరకంబాడి పంచాయతీలోని అమర రాజా విద్యాలయంలో అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. రమాదేవి, షేర్డ్ సర్వీస్ హెడ్, అమర రాజా ఎనర్జీ, మొబిలిటీ లిమిటెడ్ నళినీ కుమార్ పాల్గొన్నారు. గురవరాజు పల్లి పంచాయతీ రామకృష్ణాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్థానికులు రాజా రాయల్, సెవెన్ హిల్స్ రాము పాఠశాలకు బీరువా వితరణ చేశారు. వెదుళ్ల చెరువు ఎస్టీ కాలనీ పాఠశాలలో శుక్రవారం ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు, పాఠశాల కో–ఆప్షన్ సభ్యులు జూలియన్ రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు.

సత్యవేడు: ఎందరో మహనీయుల త్యాగఫలమే ప్రజలు అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని సత్యవేడు కోర్టు సివిల్ జడ్జి ఏ.వెంకట నాగరాజు అన్నారు. బీసీ బాలురు గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వి.ప్రతిమ, ఆయా కార్యాలయాల్లో తహసీల్దార్ రాజశేఖర్, ఎస్‌ఐ రామస్వామి, సబ్‌జైలు సూపరింటెండెంట్ కరీముల్లా జాతీయ పతాకాలు ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, త్రివిక్రమరావు, ఎంఈఓ రవి, ఇబ్రహీం ఖాన్ పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ టి.పద్మప్రియ, ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సుధీర్ రెడ్డి, కదూరు సింగిల్ విండో కార్యాలయం వద్ద సీఈఓ సంపత్, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్‌ఐ మల్లికార్జున్, పాండూరు హైస్కూల్ వద్ద స్కూల్ హెచ్‌ఎం మునిసుబ్రమణ్యం, సామర్ల భువనేశ్వరి, చిన్న పాండూరు పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారులు పవన్‌కుమార్, ప్రశాంత్ జెండాను ఎగురవేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ: తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శ్రీదేవి, ఎంపీడీఓ కార్యాలయంలో వైస్ ఎంపీపీ మునెమ్మ, ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తమ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు.

నారాయణవనం: మండల వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన పిల్లలకు స్వీట్లు, బహుమతులను అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ జెండా ఎగురవేశారు.

నాగలాపురం: పంచాయతీ, మండల పరిషత్, ట్రాన్స్‌కో, సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ స్కూళ్లు, పోలీస్ స్టేషన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ శ్యామ్, జెడ్పీటీసీ సుమతి, ఎంపీడీఓ బాలాజి నాయక్, పంచాయతీ కార్యదర్శి శంకరయ్య, ఎస్‌ఐ సునీల్, ఎంఈఓ బాబయ్య, జనార్ధన్ రాజు, నాయకులు అపరంజిరాజు, మోహన్ మొదలియార్, కులశేఖర్, ఉదయ్, వీఆర్వో నాగభూషణం పాల్గొన్నారు.

240 పరిశ్రమల నిలయం శ్రీసిటీ

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్ ప్రాంగణం వద్ద శ్రీసిటీ ఇన్‌చార్జ్ డీఎస్పీ జి.చెంచు బాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేసి మాట్లాడారు. సెక్యూరిటీ సిబ్బంది కవాతు నిర్వహించారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో.. శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబాలతోపాటు మనదేశాన్ని అత్యుత్తమ దేశంగా స్వేచ్ఛ, శాంతి, ఐక్యతతో జీవించేందుకు అనువైన మంచి ప్రదేశంగా మార్చడానికి అందరూ కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. శ్రీసిటీ 240 తయారీ పరిశ్రమలకు నిలయంగా మారడంతో పాటు ఉద్యోగాల కల్పనకు ఉత్తేజాన్ని ఇవ్వడం, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా శ్రీసిటీ తన వంతు కృషి చేస్తుందని అన్నారు. విధుల్లో విశేష సేవలను గుర్తిస్తూ, శ్రీసిటీలోని సెక్యూరిటీ, హౌస్ కీపింగ్, ల్యాండ్ స్కేపింగ్, ఇంజినీరింగ్, ఫొటోగ్రఫీ తదితర విభాగాలకు చెందిన 36 మంది సిబ్బందికి ఉత్తమ అవార్డులు ప్రదానం చేశారు. మల్లవారిపాళెం తూర్పు, ఆరూరు గ్రామాల యువకులు ప్రదర్శించిన కరాటే, కరగాట్టం, కోలాట నృత్యాలు ప్రత్యే ఆకర్షణగా నిలిచాయి. వివిధ పరిశ్రమలు, శ్రీసిటీ సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయం, హెచ్‌ఆర్డీ అకాడమీ, ట్రిపుల్ ఐటీ, కియా యూనివర్సిటీ, చిన్మయ విద్యార్థులు, అకార్డ్ స్కూల్, శ్రీసిటీలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు.



శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి



ఏర్పేడు: అంజిమేడులో పిల్లలకు బ్యాగులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మోహన్‌రెడ్డి



సత్యవేడు కోర్టు వద్ద జెండా ఎగురవేస్తున్న జడ్జి వెంకటనాగరాజు











తొట్టంబేడు: తహసీల్దారు భారతి జెండా వందనం, వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయం వద్ద..., శ్రీసిటీ డీఎస్పీ చెంచుబాబు గౌరవ వందనం, నారాయణవనం: ఎంపీడీఓ కార్యాలయంలో.., శ్రీకాళహస్తి: జెండా ఎగుర వేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి

విద్యార్థులకు ఉపకార వేతనాలు

సత్యవేడు: ప్రభుత్వ బాలికల పాఠశాలల్లోని విద్యార్థుల్లో ప్రతిభావంతులకు శుక్రవారం సత్యవేడు కెనరా బ్యాంకు మేనేజర్ కార్తీక్ రెడ్డి ఉపకార వేతనాలు అందజేశారు. మేనేజర్ మాట్లాడుతూ, 6, 7వ తరగతులకు చెందిన అను దీప్తి, జ్యోతిక, జయశ్రీకి ఒక్కొక్కరికి రూ.3వేలు, 8, 9, 10వ తరగతి చదువుతున్న తర్నిక, చామిని, ఎం.ఏంజెల్‌కు రూ. 5వేల చొప్పున అందజేశామన్నారు.

నూతనంగా నిర్మించిన సీసీ రోడ్ల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో 2017– 2018లో వేసిన సిమెంట్ రోడ్లను శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ క్వాలిటీ కంట్రోల్ విజిలెన్స్ డీఈఈ శంకరయ్య సిబ్బందితో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, రూ. 2 కోట్లతో మండలంలో 25 సిమెంట్ రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. ఈ బిల్లుల కోసం నాణ్యత కొలతల పరిశీలన కోసం ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.

భక్తిప్రపత్తులతో ఆలయ కుంభాభిషేకం

వరదయ్యపాళెం: మండలంలోని నాగనందాపురంలో నూతన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శంఖు, చక్రంతో కూడిన నామ శిలాఫలకాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని సైతం ఆలయంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశేష అలంకరణ చేశారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



ఆలయ కుంభాభిషేకంలో హోమపూజలు చేస్తున్న వేద పండితులు

సచివాలయాల్లో సేవలకు మంగళం

- తెరుచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- సంక్షేమ పథకాల దరఖాస్తుకు ఇబ్బందులు





పథకాల కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు (ఫైల్)

వరదయ్యపాళెం: ప్రజాసంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడుతుందా అనే అనుమానం కలిగేలా ప్రభుత్వ పాలన సాగుతోందని ప్రజలు వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం ఎక్కడ ఎన్నికల హామీలను అమలు చేయాల్సి వస్తుందోనన్న భయంతో ప్రభుత్వ సైట్లను తెరవడం లేదు. 2024లో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సంఘం తాత్కాలికంగా ప్రభుత్వ సైట్లను మూసివేసింది. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14నెలలు దాటిపోతున్నా ప్రభుత్వ సైట్లు మాత్రం తెరుచుకోవడం లేదు. సైట్లు తెరవకపోవడంతో వివిధ పథకాల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ప్రభుత్వ సైట్లు తెరవకపోవడంతో వివిధ రకాల సేవలు, పథకాల కోసం దరఖాస్తులను అప్‌లోడ్ చేయలేకపోతున్నామని సచివాలయ ఉద్యోగులు అంటున్నారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయ, వలంటరీ వ్యవస్థను అమల్లోకి తెచ్చి 500 సేవలను సచివాలయాల ద్వారా అమలు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లను పక్కనపెట్టింది. ఎన్నికల హామీలో భాగంగా రూ.5 వేల నుంచి రూ.10 వేలకు గౌరవవేతనం పెంచుతామంటూ అధికారంలోకి వచ్చిన తరువాత పెంచకపోగా విధుల నుంచి తప్పించారు. వలంటీర్లు లేకపోవడంతో లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు, సేవల కోసం సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

కొత్త పింఛన్లు ఎప్పుడో?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రతి ఏడాది జనవరి, జూలై నెలల్లో కొత్త పింఛన్లు మంజూరు చేసేది. 2024 ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత సైట్ మూతపడింది. ప్రభుత్వ సైట్లు మూసివేసే సమయానికి దరఖాస్తు చేసుకున్న పింఛన్లకు ఇప్పటి వరకు మోక్షం లభించకపోగా, సైట్లు ఓపెన్ చేయకపోవడంతో కొత్త వాటికి దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుడాపోయింది. రేషన్ కార్డుల విషయంలో కూడా ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేస్తోంది. గత ప్రభుత్వంలో సాధారణంగా చనిపోతే రూ.లక్ష, ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.5 లక్షలు వైఎస్సార్ బీమా కింద ఆర్థికసాయం అందించేవారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సాధారణ మరణానికి రూ.5లక్షలు, ప్రమాదమైతే రూ.10 లక్షల చొప్పున సాయం అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం సైట్‌ను ఓపెన్ చేయకపోవడం పట్ల బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పరిస్థితి అలాగే ఉందని, సైట్‌లోని పలు ఆప్షన్లు పనిచేయడం లేదని వాపోతున్నారు. పెళ్లి కానుక విషయంలోనూ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. గత ప్రభుత్వం పేద కుటుంబాలను ఆదుకోవడానికి వివాహ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించింది. బీసీ కులాలకు రూ.50 వేలు, వధూవరుల్లో ఎవరైన దివ్యాంగులు ఉంటే వారికి రూ.75 వేలు, ఎస్సీ సామాజిక వర్గానికి రూ.లక్ష, వారిలో ఒకరు దివ్యాంగులైతే రూ.1.5 లక్షలు, బీసీ, ఎస్సీ సామాజిక వర్గాల్లో కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు చొప్పున ఆర్థికసాయం అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని రెండింతలు చేస్తామని ఇచ్చిన హామీ గాలికి వదిలేసింది. ఈవిధంగా గత ప్రభుత్వంలో ప్రజలు పొందిన అనేక సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం చాప కింద నీరులా నీరు గార్చే ప్రయత్నాలు చేయడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదిగా ఎదురుచూస్తున్నా..



నా భర్త ఏడాది క్రితం మరణించాడు. అప్పటి నుంచి పింఛన్ దరఖాస్తు కోసం సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నా సమాధానం చెప్పే దిక్కు లేదు. కనీసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదు. కుటుంబానికి పెద్దదిక్కైన భర్తను కోల్పోయాను. ఈ పరిస్థితుల్లో నా జీవనం ప్రశ్నార్థకంగా మారింది. నాలాంటి వితంతువు పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వారికైనా తక్షణం మంజూరు చేసి ఆదుకోండి.

–మహాదేవి, నాగనందాపురం, వరదయ్యపాళెం మండలం

స్పౌజ్ పింఛన్ మంజూరు చేశామన్నారు..



ఇటీవల పింఛన్ వస్తున్న భర్త కోల్పోయిన వారికి ఆ పింఛన్‌ను స్పౌజ్ కింద భార్యకు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం హడావుడి చేసింది. ఆ దశలో ఇటీవల నా భర్త మరణించాడు. స్పౌజ్ పింఛన్ కోసం స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటి దాకా పింఛన్ మంజూరు కాలేదు. ఇటీవల పింఛన్ మంజూరైనట్లు సచివాలయంలో చెప్పారుకానీ నగదు మాత్రం నాకు అందించలేదు. తక్షణమే వితంతు పింఛన్ మంజూరు చేయాలి.

–గౌరి, వరదయ్యపాళెం

ప్రభుత్వ సైట్లను తెరవాలి..



ఎన్నికలకు ముందు మూసివేసిన పలు ప్రభుత్వ సైట్లను తెరవాలి. సైట్లను మూసి వేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తులు చేయడానికి సైట్ పని చేయడంలేదని సచివాలయ ఉద్యోగులు చెప్పుతున్నారు. సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా అదే పరిస్థితి నెలకొంది.

–జగదీష్‌రెడ్డి, వరదయ్యపాళెం మండలం

గృహ ప్రవేశ వేడుకలో వైఎస్సార్‌సీపీ నేతలు



వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

రేణిగుంట: మండలంలోని గుత్తివారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లోకనాథ్ రెడ్డి, ఎంపీటీసీ ఉమా దంపతుల నూతన గృహప్రవేశ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి, శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొని వారికి అభినందనలు తెలిపారు. వీరితో పాటు మాజీ జెడ్పీటీసీ సభ్యులు తిరుమల రెడ్డి, ఎంపీపీ హరి ప్రసాద్ రెడ్డి, మండల అధ్యక్షుడు గంగారి రమేష్, జువ్వల దయాకర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు గణేష్ రెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, ముని రెడ్డి, వెంకటరమణారెడ్డి, ధనంజయలు రెడ్డి, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేతో కంఠా ఉదయ్‌కుమార్



మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న కంఠా ఉదయ్‌కుమార్

శ్రీకాళహస్తి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం కమిటీ కార్యదర్శిగా పట్టణానికి చెందిన కంఠా ఉదయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కలిసి సన్మానించారు.